# కళ్యాణ ఘడియ

ట్రిమ్‌గా డ్రస్సై హుషారుగా ఈల వేసుకుంటు బయటకు వెళుతున్న కొడుకును పిలిచాడు గోవిందయ్య.

చిరాగ్గా ముఖం చిట్లించి ఎందుకు పిలిచావన్నట్లుగా చూసాడు చంద్రం.

"ఇంత ప్రొద్దునే ఎక్కడికిరా బయలుదేరావు" చదువుతున్న పేపర్ని మడిచి బల్లమీద పెడ్తూ అడిగాడు గోవిందయ్య.

"లైబ్రరీకి నాన్నా" పొడిగా జవాబిచ్చాడు చంద్రం.

"అలా కరంటాఫీసుకు కూడా వెళ్ళి పీజు కట్టేసిరా. ఇవాళ దాటితే ఫైను. లేచి పంచె సరిచేసుకుంటూ బీరువా తెరిచాడు గోవిందయ్య.

అయిష్టంగానే తండ్రి ఇచ్చిన డబ్బుని జేబులో కుక్కుకుని, మళ్లీ ఎక్కడ పిలుస్తాడోనని వడివడిగా బయటపడ్డాడు చంద్రం.

సందు మలుపు తిరిగాక ఒక మారు అటు ఇటు చూసాడు. వెంటనే బేక్ పాకెట్ లోంచి సిగరెట్ పేకట్టు తీసి, ఒక సిగరెట్టు వెలిగించు కున్నాడు. గుప్పు గుప్పు మని పొగ వదుల్తూ విలాసంగా ముందుకు నడిచాడు.

ఉన్నట్లుండి ఓ ఇంటి ముందు అతడి కాళ్ళకు బ్రేకులు పడ్డాయి. కాలుతున్న సిగరెట్ పీకను•నేలమీద పడేసి బూటుకాలితో కసిగా మట్టాడు. దగ్గర్లో వున్న కిళ్లీ బడ్డీలో సోడా త్రాగి బల్లమీద చతికిల బడ్డాడు. అతడి చూపంతా ఆ ఇంటిమీదే వుంది.

ఒక ముసలాయన ఆ ఇంట్లోంచి బయటికొచ్చి రెండు రిక్షాల్ని పిలిచాడు.

"మరి మాకు శలవ్ రమణయ్యగారూ" రిక్షా లెక్కారు ఆ ఇంటికి వచ్చిన వ్యక్తులు.

"మంచిది మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ వుంటాం." చేతులు జోడించాడు రమణయ్య.

రిక్షాలు కదిలాయి.

రమణయ్య గారమ్మాయి సరోజ గుమ్మం దగ్గర నిలబడి వాళ్ళు వెళుతున్న వైపు కన్నార్పకుండా చూస్తోంది.

ఆ రోజు పది దాటినా సరోజ కాలేజీకి ఎందుకు బయలుదేరలేదో అర్థమైపోయింది చంద్రానికి.

మరుక్షణం సైకిలొకటి అద్దెకు తీసుకుని ఆ రిక్షాల్ని అనుసరించాడు.

అవి తిన్నగా ఆర్.టి.సి. కాంప్లెక్స్ చేరుకున్నాయి. తెల్లటి గ్లాస్కో పంచె కట్టీ లాల్చీలో భారీగా వున్న వ్యక్తి వెడల్పైన వెండి జరీ నీలం కంచి పట్టుచీర కట్టుకుని సైజులో అతడి కేమాత్రం తీసిపోని అతని సతీమణి రిక్షాదిగారు.

నేవీబ్లూ ఫ్యాంటు, తెల్లని పాలిస్టర్ శ్లాక్ ధరించిన సుమారు పాతికేళ్లున్న కుర్రాడొకడు మరో రిక్షాలోంచి దిగాడు. ముఖం చూస్తే అతడు వాళ్ళబ్బాయని సులభంగా చెప్పేయవచ్చు.

చంద్రం హడావిడిగా సైకిల్, స్టాండులో పెట్టి లోపల కెళ్ళే సరికి వాళ్ళు బల్లమీద కూర్చుని బస్సుకోసం నిరీక్షిస్తూ వుండడం కంట బడింది. అప్పుడే వాళ్ళబ్బాయి లేచి ఎన్‌క్వయిరీ ఆఫీసు వైపు వెళ్ళాడు.

వాళ్ళతో మాట్లాడటానికి ఇదే మంచి సమయమనుకున్నాడు చంద్రం.

"నమస్కారమండీ" చేతులు జోడించాడు చంద్రం.

తేరిపార చూసాడు గ్లాస్కో పంచాయన.

మీరు రమణయ్యగారమ్మాయి సరోజను చూడటానికొచ్చారు కదూ".

"ఔను... నువ్వు..." చంద్రం వంక సందేహంగా చూసాడావ్యక్తి.

"రమణయ్యగారు స్వయాన మా మేనమామ".

"విన్నావా జానకీ, ఈ అబ్బాయి రమణయ్య గారి మేనల్లుడట" పరధ్యానంగా వచ్చే పోయే బస్సుల్ని చూస్తున్న భార్యతో అన్నాడాయన.

"అలాగా కూర్చో బాబూ" కొద్దిగా జరుగుతూ అన్నది జానకమ్మ.

"మరి రమణయ్య తనకీ వూళ్లో బంధువులెవరూ లేరన్నాడే."

"అలా అనకపోతే మరింకేమంటాడు? ఇంతకూ మీకు అమ్మాయి నచ్చిందా? ఆదుర్దా అణచుకోలేక అడిగాడు చంద్రం.

"అమ్మాయికేం నాయనా లక్షణంగా వుంది" అన్నది జానకమ్మ.

"పైగా బి.యస్.సి. చదువుతోంది" భార్య మాటలకు వంత పాడాడతడు.

"కట్నం అదీ..."

"అతని పరిస్థితి చూస్తూ వుంటే పెద్దగా కట్న కానుకలిచ్చుకో లేని వాడిలానే కనిపిస్తున్నాడు ఐనా, ఇన్నాళ్ళకు అబ్బాయికి నచ్చిన పిల్ల తారసపడింది. అందుకే ఈ సంబంధం ఖాయం చేసుకోవాలను కుంటున్నాం."

నెత్తిమీద పిడుగు పడ్డట్టైంది చంద్రానికి.

"మీవాడు ఏం చేస్తున్నాడు?"

"హైస్కూల్లో సెకండరీ గ్రేడ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు".

"చక్కటి వుద్యోగం, చదువు అన్నీ వున్న మీ అబ్బాయికి ఇంతకంటె మంచి సంబంధం దొరకలేదా?" యగతాళి ధ్వనిస్తోంది చంద్రం మాటలలో.

అతడి మాటలకు వారి మొహం మాడిపోయింది.

"మీకు తెలియక గోతిలో పడిపోతున్నారు కొంపతీసి తాంబూలాలు కూడా పుచ్చేసుకున్నారా ఏమిటి?" మిగిలిన తన సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి ప్రశ్నించాడు చంద్రం.

"ఇంకా లేదు. ఐనా నువ్వనేదేమిటో మాకేమీ అర్థం కావడంలేదు." ముఖం అదోలా పెట్టి అన్నాడు గ్లాస్కో పంచాయన.

"ఇందులో అర్థం కాకపోవడానికేముంది. సరోజ క్యారక్టరు మంచిది కాదు. ఈ వూళ్ళో ఆమెకు ఎందరితోనో సంబంధముంది. మీరు కేవలం అమ్మాయి అందం మాత్రమే చూస్తున్నారు. ఆమె చరిత్ర మీకు తెలీదు. ఆమెలో ఏలోటూ లేకపోతే నేనే ఆమెను పరిణయమాడే వాడిని."

"ఔను మేనరికం ఎవరు కాదనుకుంటారు మాకీ విషయాలేమీ తెలియక..."

"ఎలా తెలుస్తుంది చెప్పండి. కనీసం మీరీ వూళ్ళో ఎవరినైనా భోగట్టా చేసారా?.... లేదు... అందుకే ఆ సంబంధం మీద అంత మొగ్గు చూపుతున్నారు. దారిన పోతున్న ఏ దానయ్య నడిగినా ఆమె సంగతి చెప్తాడు. కూతురి బండారం ఎక్కడ బయట పడిపోతుందో నన్న బెంగతో దూరపు సంబంధాలు చూస్తున్నాడు రమణయ్య."

చంద్రం మాటలకు నోరు వెళ్ళబెట్టింది జానకమ్మ.

"ఇంతకు నువ్వేం చేస్తున్నావు బాబూ" ఉండబట్టలేక అడిగాడామె భర్త.

"ఇన్‌కమ్‌టాక్స్ ఇన్స్‌పెక్టరుగా పనిచేస్తున్నాను" నమ్మేటట్లు ఎంతో నమ్రతగా సమాధాన మిచ్చాడు చంద్రం.

"సమయానికొచ్చి ఆపద్బాంధవుడిలా మమ్మల్ని ఆదుకున్నావు. లేకుంటే మేము పప్పులో కాలేసి వుండే వాళ్ళం. నీ సహాయానికి మా కృతజ్ఞతలు" అన్నది జానకమ్మ.

"అంత మాటెందుకు లెండి మీరు రొంపిలో పడబోతున్నారని తెలిసి వుండబట్ట లేక వాగేసాను. ఒక రకంగా నాదీ తప్పేననుకోండి. వంద అబద్ధాలాడైనా ఒక ఆడపిల్ల పెళ్ళి చేయమన్నారు. కాని నేను ఒక నిజం చెప్పి ఒక అమ్మాయి సంబంధం చెడగొడుతున్నానేమో నని బాధగా వుంది".

"అలా అనుకోకు బాబు నిజం చెప్పి మాకెంతో మేలు చేసావు" అన్నారా దంపతులు.

"వస్తానండి నా బస్సుకి టైమయింది".

వారి వద్ద శలవు పుచ్చుకుని సైకిల్ స్టాండ్ వైపు నడిచాడు చంద్రం.

"నన్ను కాదని ఎక్కడకు వెళతావు సరోజా? మోజుపడి పెళ్లి చేసుకుంటానంటే తిరస్కరించావు. అవమాన పరిచావు. నీ అంత అందగత్తె ఈ లోకంలోనే వుండదని విర్రవీగావు నీకు ఈ సంబంధమే కాదు ఏ సంబంధం కూడా అవకుండా చేయకపోతే నా పేరు చంద్రం కాదు" అంటూ మనసులో ప్రతిన పూనాడు.

* * *

సరోజ, చంద్రం ఇంటర్ వరకు క్లాస్‌మేట్స్. ఐతే ఇంటర్ మీడియట్‌లో నాలుగు దండయాత్రలు చేసి అక్కడే వుండిపోయాడు చంద్రం. సరోజ మాత్రం బాగా చదువుకుంటూ బి.యస్.సి. ఫైనల్‌కి చేరుకుంది. గుండ్రటి ముఖం. తీరైన కనుముక్కు, ఎర్రటి శరీర ఛాయలో నగ నట్రా ఏమీ పెట్టుకోక పోయినా మిలమిలా మెరిసి పోతూ ఎంతో ఆకర్షణీయంగా ఉండే రూపం ఆమెది.

కాలేజీలో క్లాసులెగొట్టి మ్యాట్నీలకు చెక్కేయడం, ఆడపిలల్ని టీజ్ చెయ్యడం చంద్రం హాబీలు. అందుకే అతడంటే సరోజ కసహ్యం. ఆమె అందానికి ఆకర్షితుడైన చంద్రం మాత్రం ఆమెకు చేరువవాలని, ఆమెను పెళ్లి చేసుకోవాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఒక ఆడది అతడిని నిరాదరణ చేయడంతో అతడి అహం దెబ్బతింది. ప్రతీకారం వాంఛించిందతడి మనసు. అప్పటి నుండి ఆమెపై కక్ష

పెంచుకున్నాడు. సమయం చూసి ఆమెను దెబ్బ తీయాలని తలచాడు. సరోజకు వచ్చిన ఒక మంచి సంబంధాన్ని చెడగొట్టి నందుకు ఇప్పుడతని మనస్సెంతో తేలికపడింది.

• • •

ఒకరోజు సాయంత్రం చంద్రం మిత్ర బృందంతో ఊరంతా తిరిగి ఇంటి ముఖం పట్టాడు. అలవాటు ప్రకారం సరోజ ఇంటి వైపు చూశాడు. ఆ రోజు ఆమె ఇంటి ముందు ఎన్నో కార్లున్నాయి. లోపల బేండు మేళం ప్రతిధ్వనిస్తోంది. ఎప్పుడూ నిశ్శబ్దంగా, కళా విహీనంగా కనిపించే ఆ ఇల్లు ఆ రాత్రి రంగు రంగుల విద్యుద్దీపాలతో అలకంరింపబడి, బంధు మిత్రులతో కళకళలాడుతోంది.

"కొంప తీసి సరోజకి పెళ్ళి అయిపోతోందేమో! భయంకరమైన ఆ ఊహకు అతడి గుండెల్లో ఉన్నట్టుండి అగ్ని పర్వతాలు బ్రద్దలయ్యాయి. తడబడుతున్న అడుగులతో లోనికి ప్రవేశించాడు చంద్రం. గుమ్మంలో రిసెప్షన్ కమిటీ రిసీవు చేసుకుని, మంచి గంధం అందించి, అత్తరు జల్లి ఆహ్వానించింది.

రంగురంగుల బల్బులు, మామిడి తోరణాలతో పెళ్లి పందిరి అత్యంత శోభాయ మానంగా ప్రకాశిస్తోంది. సరోజ చెంత కూర్చున్న వరుడెవడా అని జాగ్రత్తగా పరిశీలించాడు. పెళ్లి కొడుకు జానకమ్మ గారి కొడుకు మాత్రం కాదు. ఐతే అంత తొందరలో తనకు తెలీకుండా అంతపెద్ద సంబంధం సరోజకెలా కుదిరి పోయిందో తెలియక పిచ్చెక్కిన వాడై జుట్టు పీక్కున్నాడు చంద్రం. అక్కడ వాడి అవస్థను గమనించే వారెవరూ లేరు. మంగళ వాయిద్యాల మధ్య మాంగల్య ధారణ జరిగి పోయింది.

"రమణయ్య చాలా అదృష్టవంతుడు. కట్నమిచ్చుకునే స్తోమత లేకపోయినా చక్కని సంబంధం చేసాడు" అన్నారెవరో పెళ్ళిపందిట్లో.

"నిజమే ఆ మధ్య ఏదో సంబంధం వచ్చింది. పెళ్ళికొడుకు స్కూల్లో టీచరంట. అది స్థిరమై పోతుందనే చెప్పాడు. అంతలోనే వాళ్ళకేమొచ్చిందో సంబంధం ఇష్టం లేదని చేసుకోమని చెప్పేసారట. అదీ ఒకందుకు మంచిదే అయింది. దానిని తల దన్నిన సంబంధం స్థిరపడింది. పెళ్ళికొడుకెవరో తెలుసా?" అన్నాడు మరొకడు.

తెలీదన్నట్లు ముఖం పెట్టాడు మొదటి ఆసామీ.

"ఐ.ఏ.యస్. ఆఫీసరంట".

"అలాగా, అందుకే పెళ్ళికి ఇంతమంది ఉన్నతాధికారులు హాజరయ్యారు."

మాటలు చెవిలో పడ్డచంద్రానికి మతిపోయింది. సరోజకి ఇంత మంచి సంబంధం అవడానికి పరోక్షంగా తనే కారణమవడంతో పిచ్చెక్కి నట్టైంది.

ఆషాక్‌నుండి తేరుకునే లోపల వధూవరులను ఆశీర్వదించ మన్నట్లుగా తన చేతిలో అక్షతలుంచారెవరో.

● *ఆంధ్రసచిత్ర వారపత్రిక 1.5.87* ●